క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేశ్ అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు స్థానిక ప్రధాన చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ పత్రికా కేసులో ఈడీ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని చేర్చడం దారుణమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్‌పై దాడులు కొనసాగిస్తోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ తన వైఖరిని మార్చుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, కాల్వ లింగస్వామి, కొలిపాక సుజాత, ముస్తఫా, పాతిపల్లి ఎల్లయ్య, గట్ల రమేశ్, పెద్దెల్లి ప్రకాశ్, పెద్దెల్లి తేజస్విని, దీటి బాలరాజు, జాలి రాజమణి, బాల రాజ్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

రామగుండం: అంతర్గాం మండలం టీటీఎస్ అంతర్గాం గ్రామపంచాయతీ పంపు ఆపరేటర్ బాణాల రాజేశ్ ఆత్మహత్యాయత్నానికి కారకుడైన పంచాయతీ కార్యదర్శిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని అంబేద్కర్ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు, జిల్లా కో కన్వీనర్ ఇండిబిల్లి రవీందర్ మాట్లాడారు. పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్‌ను విధులకు గైర్హాజరవుతున్నావంటూ పంచాయతీ కార్యదర్శి నోటీస్ జారీ చేశారని దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురై హేయిర్‌డై తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని సీపీని కోరుతామన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామ్‌చందర్, రాష్ట్ర సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

కాలువ నిర్మాణానికి భూపరిశీలన

ముత్తారం: మండలంలోని మచ్చుపేట ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి బగుళ్లగుట్ట 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి కాలువ నిర్మాణం కోసం గురువారం ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ భూ పరిశీలన చేశారు. 14న మచ్చుపేటకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు 400 ఎకరాల ఆయకట్టు భూములకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సాగునీరు అందించాలని రైతులు విన్నవించారు. రైతుల విన్నపం మేరకు మంత్రి ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ, మెగా కంపెనీ ప్రతినిధి శ్రావణ్ పరిశీలించారు. పరిశీలన నివేదికను సంబంధిత ఇరిగేషన్ ఉన్నత అధికారులకు అందజేస్తామని ఏఈ తెలిపారు. మాజీ సర్పంచ్ మేడగోని సతీశ్, కాంగ్రెస్ నాయకులు గోవిందుల ఆనంద్, తాళ్లపల్లి కుమారస్వామి, రైతులు ఉన్నారు.

ఆరెంద పాఠశాల సందర్శన

మంథని: మంథని మండలం ఆరెంద కాంప్లెక్స్ పరిధిలోని వెంకటాపూర్, ఆరెంద పాఠశాలలను డైట్ విద్యార్థిని రాథోడ్ అస్మిత గురువారం సందర్శించింది. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను పరిశీలించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంలు బెజ్జాల శ్రీలత, సుజాత, సీఆర్‌పీ మల్లయ్య ఉన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



వరిని పరిశీలిస్తున్న గంట రాములు

ఓదెల: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ కోరారు. మండలంలోని శానగొండ, ఇందుర్తి, బాయమ్మపల్లె గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నష్టపోయిన పంటల వివరాలను సేకరించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాధికారులు దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని జిల్లా వ్యవసాయధికారిని ఫోన్‌లో కోరారు.

డీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ఎలిగేడు: డీటీఎఫ్ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పులి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నగునూరి రాజేశ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎ.రాములు, జి.శ్రీవాణి, వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా బి.శ్రీధర్, డి.రామ్మోహన్, సీహెచ్ స్రవంతి, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.సంతోష్‌కుమార్‌రెడ్డి, ఎ.రామ్మోహన్, ఎ.వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిడి సంతోష్‌రెడ్డి గురువారం తెలిపారు.

ఏఐతో పఠనాసక్తి పెంపు

- కంప్యూటర్‌పై ఆసక్తితో మెరుగైన విద్యార్థుల హాజరుశాతం
- ప్రాథమిక స్థాయి నుంచే సబ్జెక్టులపై పట్టు సాధింపు



విద్యార్థులకు ఏఐ విద్యాబోధన చేయిస్తున్న ఉపాధ్యాయులు

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన చేపట్టాలని నిర్ణయించింది. ప్రాథమిక దశలోనే విద్యార్థులు అన్ని అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలనన ఉద్దేశంతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)తో విద్యాబోధన చేపట్టాలని శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ప్రాథమిక పాఠశాలల్లో ఏఐతో పాఠాలు బోధిస్తున్నారు. రామగుండం మండల పరిధిలో అబాది రామగుండం, గాంధీ పార్క్ తెలుగు/ఉర్దూ మీడియం, మల్యాలపల్లి ప్రాథమిక పాఠశాలలో పైలట్ ప్రాజెక్టు కింద ఏఐ విద్యాబోధనకు ఎంపిక చేశారు. కాగా గాంధీ పార్కు తెలుగు/ఉర్దూ మీడియం, అబాది రామగుండం స్కూల్‌లో విద్యాబోధన జరుగుతోంది.

హాజరుశాతం పెరుగుతోంది



కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యాబోధన చేయడం ప్రారంభం నుంచి పాఠశాలలో హాజరుశాతం పెరుగుతోంది. విద్యార్థులు సాధన చేసే క్రమంలో వారు చేసే తప్పులను గుర్తించి సరైనా పదాలతో సాధన చేయిస్తోంది. దీంతో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించే అవకాశం ఉంటుంది.

– రాంపెల్లి శ్రీనివాస్‌శర్మ, హెచ్‌ఎం, అబాది రామగుండం పాఠశాల

నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది



ప్రతీరోజు టీచర్లు చెప్పే పాఠాలతో అంతగా ఆసక్తిగా వినేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణతో ప్రతీ విషయం నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది. గతంలో పాఠశాల ఇంటి బెల్ ఎప్పుడు కొడతారని ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు ఇంకా టైం ఉంటే బాగుండు అనిపిస్తోంది.

– సాన్విక, 5వ తరగతి, అబాది రామగుండం పాఠశాల

తప్పులను సరిదిద్దుతోంది



టీవీల్లో కంప్యూటర్‌ను చూశాను. కానీ మా పాఠశాలలో నాకే కంప్యూటర్ శిక్షణ ఇస్తారని కలలో కూడా అనుకోలేదు. కంప్యూటర్‌లో ఏఐ శిక్షణతో చదువుకునే సమయంలో మేము చేసే తప్పులను చూపిస్తూ సరిదిద్దుతోంది. దీంతో చదువుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది.

– అభయ్‌రామ్, 4వ తరగతి, అబాది రామగుండం పాఠశాల

త్వరలోనే మార్కెట్ నిర్మాణం పూర్తి చేస్తాం





మార్కెట్ షెడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ముళ్లపొదలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజలకు తాజా కూరగాయలు అందించాలన్న ఉద్దేశంతో ఏడేళ్ల క్రితం నిర్మించిన రోజువారీ సంతను అందుబాటులోకి తీసుకురాలేదు. దీనిపై 14న సాక్షి దినపత్రికలో రోజువారీ సంతకు మోక్ష మెన్నడు? అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ స్పందించారు. ఎమ్మెల్యే చొరవతో కమిషనర్ జిల్లా అదనపు కలెక్టర్ గురువారం యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తా వాటర్ ట్యాంక్ వద్ద గల అసంపూర్తిగా ఉన్న మార్కెట్ షెడ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మార్కెట్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి త్వరలోనే పూర్తిస్థాయిలో మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి మార్కెట్ చుట్టూ పేరుకుపోయిన ముళ్లపొదలు, చెత్తాచెదారం తొలగించి, నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు రామన్(ఈఈ), జమిల్(డీఈ), శానిటరీ సూపర్‌వైజర్ సారయ్య, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

మంథని: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కోరారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో మంథని మండలం ఎక్లాస్‌పూర్, గంగాపురిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఖానాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం డైరెక్టర్ రావికంటి సతీశ్‌కుమార్, శ్రీపాదకాలనీలో డైరెక్టర్ దాసరి లక్ష్మి, అంగులూర్ కేంద్రాన్ని డైరెక్టర్ లెక్కల కిషన్ రెడ్డి ప్రారంభించారు. సంఘం ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, ఆకుల రాజబాబు, కొత్త శ్రీనివాస్, దేవళ్ల విజయ్‌కుమార్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండ్రి రమ, ఓదెలు, లైసెట్టి రాజు, ప్రవీణ్, శ్రీకాంత్, రమేశ్, సహకార శాఖ మానిటరింగ్ అధికారి పి.సురేందర్‌రెడ్డి, సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని ఆదివారంపేట, రామయ్యపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం ముత్తారం పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రారంభించారు. వైస్ చైర్మన్ ఎలువక కొమురయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాపన్న పాల్గొన్నారు.

కమాన్‌పూర్: పీఏసీఎస్ ఆధ్వర్యంలో సిద్దిపల్లె, పేంచికల్‌పేట, నాగారం, రొంపికుంట, గొల్లపల్లె, గుండారంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు ప్రారంభించారు. వైస్‌చైర్మన్ చిందం తిరుపతి, డైరెక్టర్లు చంద్రయ్య, మూర్తి, మాజీ సర్పంచ్‌లు ఓదెలు, శంకర్, రవీందర్, చంద్రమౌళి, సీఈవో తిమ్మరాజు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి, పెర్కపల్లి, కానంపెల్లి, బొమ్మారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, సహకార సంఘం చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రాజమల్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహం, రాజేశం, శ్రీనివాస్, రాజేశం, అంజయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన సంకరి లచ్చయ్య(57)అనే వ్యక్తి అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం లచ్చయ్యకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నాడు. రెండేళ్ల క్రితం కూతుర్ల పెళ్లిళ్లు చేయడంతో రూ.15లక్షల అప్పు అయింది. కాగా ఆ అప్పు ఎలా తీర్చాలని మానసికంగా కొన్నిరోజుల నుంచి మనోవేదనకు గురవుతున్నారు. గురువారం గ్రామ శివారులో తను కౌలుకు చేస్తున్న వ్యవసాయ పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• మంథనిలో 19న రన్ ఫర్ జీసస్

మంథని: మంథనిలో 19న రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంసీపీఎఫ్ కమిటీ అధ్యక్షుడు ఐతు డేవిడ్ గురువారం తెలిపారు. మంథని పెట్రోల్ బంక్ నుంచి ర్యాలీ ప్రారంభమై అంబేడ్కర్ చౌక్ మీదుగా బస్సు డిపో వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

• సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వివిధ కార్మిక సంఘాల యూనియన్ల జీఏసీ నాయకులు కోరారు. యైటింక్లయిన్‌కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడారు.

• విధులు బహిష్కరించిన లోడింగ్ కార్మికులు

పాలకుర్తి: బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహించే లోడింగ్ కార్మికులు గురువారం ఉదయం షిఫ్టులో విధులు బహిష్కరించారు. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం కంపెనీలో సిమెంట్ బ్యాగులు లోడింగ్ చేసేందుకు గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం షిఫ్టుకు 22 మంది చొప్పున మూడు షిఫ్టులకు 66 మంది విధులు నిర్వహించాలి. అయితే ప్రస్తుతం ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులలో 11 మంది చొప్పున, రాత్రి షిఫ్టుకు 22 మంది మాత్రమే విధుల్లోకి తీసుకుంటామని అధికారులు తెలపడంతో కార్మికులు ఉదయం షిఫ్టు విధులను బహిష్కరించారు. గతంలో యాజమాన్యం చేసుకున్న ఒప్పందం ప్రకారం మూడు షిఫ్టులకు 66మంది కార్మికులను విధుల్లోకి అనుమతించాలని, లేదంటే పూర్తిస్థాయిలో విధులు బహిష్కరిస్తామన్నారు. దీంతో యాజమాన్యం బి.షిఫ్టు నుంచి గతంలో మాదిరిగా షిఫ్టుకు 22మంది కార్మికులను విధులకు అనుమతించారు.

• విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో గురువారం రాష్ట్ర ఎస్ఎఫ్ఐ మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా జెండాలు ఏర్పాటు చేయొద్దు

సుల్తానాబాద్: రహదారుల వెంబడి ప్రమాదకరంగా జెండాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలను గురువారం మున్సిపల్ కార్మికులను ఆదేశించి తొలగించారు. ఏ పార్టీ వారైనా మున్సిపల్ అనుమతి తీసుకొని జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బస్టాండ్ పరిసరాలను చదును చేయించారు. ఊర చెరువు వద్ద ఉన్న పిచ్చిమొక్కలను ట్రాక్టర్ ద్వారా తొలగించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఎన్టీపీసీ రామగుండం- తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో గురువారం జరిగిన స్టూడెంట్ కేబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. ఏజీఎం హెచ్‌ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, హెచ్‌ఎం రెవరెండ్ ఫ్రాన్సిస్ ఎ.డోమినిక్, డాక్టర్ రమ్యకృష్ణ, ఫ్రాన్సిస్ రాయపరెడ్డి, థామస్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు సుదేశ్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలోని శ్రీభూనీలసమేత మానేటి రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం రథోత్సవంలో స్వామివారు కొలువుదీరగా ఊరేగింపు అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శంకరయ్య, పురోహితులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, గోవర్ధనగిరి రాజ్‌కుమార్, నాయకులు విజేందర్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, కోటగిరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

మంథని: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి గురువారం మంథనిలో నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్, నాయకులు తగరం శంకర్‌లాల్, ఎక్కటి అనంతరెడ్డి, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, వేముల లక్ష్మయ్య ఉన్నారు.

ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ

జూలపల్లి: జూలపల్లి మండల ప్రత్యేకాధికారిగా ఎంపీవో అనిల్‌రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. మండల కేంద్రంలో పారిశుధ్య పనులను కార్యదర్శి ముజుబుద్దీన్‌తో కలిసి పరిశీలించారు.

అగ్రిఫామ్ సందర్శన

రామగుండం: అంతర్గాం మండలం రాయదండిలోని అగ్రిఫామ్‌ను గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శంకర్ సందర్శించారు. పల్లె రాజు పటేల్ అగ్రిఫామ్ నెలకొల్పి పశుపోషణ, ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడని కొనియాడారు. నూతన పోకడలకు శ్రీకారం చుట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఓడ్నాల సురేశ్

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన ఎండీ.రెహాన్(30)కు గురువారం గ్రామస్తులు ఆర్థికసాయం అందజేశారు. రెహాన్ తల్లి గతంలో అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి అతను అమ్మమ్మ అబేదాబేగం దగ్గర ఉంటున్నాడు. అతను బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రెహాన్‌కు చికిత్స కోసం దాదాపు రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన ఓడ్నాల సురేశ్ అనే సామాజిక కార్యకర్త సోషల్ మీడియా ద్వారా అతడి పరిస్థితిని వివరిస్తూ పోస్టులు చేశారు. దీంతో గ్రామస్తులతో పాటు పలువురు మానవతావాదులు స్పందించి తమకు తోచినంత విరాళాలు అందజేశారు. విరాళాలుగా సేకరించిన మొత్తం రూ.58,320 రెహాన్ అమ్మమ్మ అయిన అబేదాకు అందజేశాడు.

ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో గురువారం పరిసరాల పరిశుభ్రత, సంక్షేమ పథకాలపై నిర్వహించిన కళాజాత ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు స్నేహలత, మల్లేశ్‌గౌడ్, స్వప్న, శంకర్‌గౌడ్, రాజన్న, వెంకటస్వామి, రేణుక, సుధీర్, శ్రీవల్లి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



సమావేశం నిర్వహిస్తున్న ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.నాగేశ్వరరావు

రామగిరి: ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులతో గురువారం జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏరియాలకు సంబంధించిన పలు అంశాలపై జీఎంలు, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్రారెడ్డి, సభ్యులతో చర్చించారు. ఓసీపీ–2 ఈపీ ఆపరేటర్స్ ఉద్యోగులకు విశ్రాంతి గది నిర్మించడం, ఓసీపీ–2 నందు నూతన మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంక్ నిర్మించడం, ఓసీపీ–1, 2 భారీ యంత్రాల ఏసీలు మరమ్మతు చేయడం, ఏపీఏ గనిలో విధులు నిర్వహిస్తున్న అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులను సర్ఫేస్‌కు బదిలీ చేయడం, 3వ సీమ్ లైట్ వాహనాలకు దారి ఏర్పాటు చేయడం, సెంటినరికాలనీ వాసులకు తాగునీటి సరఫరా చేయడం పలు అంశాలపై చర్చించారు. జీఎంలు మాట్లాడుతూ కార్పొరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్ట్రక్చర్ కమిటీ సభ్యులు, ఎస్‌వోటూ జీఎం బి.వి.సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారులు జె.రాజశేఖర్, ప్రవీణ్ వి ఫొంటింగ్, విభాగాధిపతులు చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, కాశీ విశ్వేశ్వరరావు, అధికారులు హుస్సేన్ పాల్గొన్నారు.

హెడ్ ఓవర్‌మెన్ కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని జీడీకే–7ఎల్‌ఈపీ గనిలో తీట్ల సత్యనారాయణ పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందారు. కాగా ఆయన కుటుంబానికి గురువారం చెక్కు అందజేశారు. జీఎం కార్యాలయంలోని చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.20.46లక్షల విలువచేసే చెక్కును జీఎం వెంకటయ్య చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి అందజేశారు. వీటిలో మ్యాచింగ్ గ్రాంట్ రూ.10లక్షలు, తోటి కార్మికులు విరాళంగా అందించిన రూ.10.46లక్షల విలువ గల చెక్కులు అందించారు. ఏఐటీయూసీ నాయకులు రవీందర్, ఎస్‌వోటూ జీఎం ఎం.రాముడు, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్‌కుమార్, డీవైపీఎం శ్యాంప్రసాద్, సీనియర్ ఎస్టేట్ అధికారి జె.సునీత, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం



నూతన కమిటీ పత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటామని ఆర్జీ–1 టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ పేర్కొన్నారు. గురువారం ఆర్జీ–1 జీడీకే–1 సీఎస్పీలో నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. గడిచిన పదేళ్లలో గుర్తింపు యూనియన్‌గా అనేక సమస్యలు సాధించామన్నారు. టీబీజీకేఎస్ జాయింట్ సెక్రెటరీ చెల్పూరి సతీశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పోలాడి శ్రీనివాసరావు, దూట శేషగిరి, మీస రాజు, ఉప్పులేటి తిరుపతి, వాసర్ల జోసెఫ్, జనగామ మల్లేశ్, కొప్పుల శ్రావణ్, మీస రాజు, భాస్కర్, తొగరి నరేశ్, దేవేందర్, ప్రసాద్, రాజ్‌కుమార్, శ్రీనివాస రెడ్డి, అనురాజ్, మల్లారెడ్డి, విక్రమ్, సాధిక్ అలీ, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువ కార్మికుల సదస్సు విజయవంతం చేయాలి

గోదావరిఖని: గోదావరిఖనిలో ఈనెల 20న జరిగే యువకార్మికుల సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి కోరారు. ఆర్జీ–1 సివిల్ డిపార్ట్‌మెంట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఐదేళ్ల వరకు ఉన్నాయని, కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ ఉంటుందని, లేకుంటే యువ కార్మికులకు ఉద్యోగ భద్రత కొరవడుతుందన్నారు. సదస్సుకు యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు ఆరెల్లి పోశం, దాసరి శ్రీనివాస్, శంకరయ్య, వెంకటేశ్వర్లు, బీఆర్‌కేరెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లతో అంచనా వ్యయం

సాక్షి స్పందన

జ్యోతినగర్: 'కంకర తేలి గుంతలు ఏర్పడి' అనే శీర్షికన సాక్షి దినపత్రిక జోన్ పేజీలో బుధవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పందించారు. రాజీవ్ రహదారి ఎన్టీపీసీ హెలిప్యాడ్ ట్యాంక్ నుంచి నర్రశాలపల్లి ప్రభుత్వ పాఠశాల వరకు రూ.2కోట్ల అంచనా వ్యయంతో సీసీరోడ్డు నిర్మించడానికి పాలనాపరమైన ఆమోదం తెలుపుతూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్లకు చేరుకోవడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో ప్రజల కోరిక మేరకు రోడ్డు నిర్మించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ వెంటనే స్పందించి ప్రతిపాదనలు సమర్పించల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు 8మీటర్ల వెడల్పుతో 1200 మీటర్ల దూరం హెలిపాడ్ ట్యాంక్ నుంచి నర్రశాలపల్లి ప్రభుత్వ పాఠశాల వరకు సీసీరోడ్డు నిర్మించడానికి అంచనాలు తయారు చేశారు. రూ2కోట్లు మంజూరు చేస్తూ వెంటనే సాంకేతిక అనుమతులు పొంది టెండర్ ప్రక్రియ ప్రారంభించాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజలు సాక్షికి, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓదెల–2 సినిమా హిట్ అవ్వాలని ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అభిమానులు

ఓదెల: ఓదెలకు చెందిన ప్రముఖ దర్శకుడు సంపత్ నంది నిర్మాతగా వ్యవహరించిన ఓదెల–2 సినిమా విడుదల సందర్భంగా సంబరాలు జరిపారు. గురువారం సినిమా విడుదల కావడంతో అభిమానులు ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. మాజీ సర్పంచ్ మహేందర్, శేషమూర్తి, సతీశ్, సంతోష్ పాల్గొన్నారు.

థియేటర్ ఎదుట సంబరాలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీలో ఉన్న శ్రీరామ థియేటర్ వద్ద ఓదెల–2 సినిమా విజయవంతం కావాలని ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ కోరారు. థియేటర్ ఎదుట గురువారం కేక్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, హరికృష్ణ, సుగుణాకర్, వెంకటస్వామి, రత్నం, శ్రీనివాస్, నర్సన్న పాల్గొన్నారు.